# వరలక్ష్మి

వరలక్ష్మి దేనికీ ఆశపడే స్వభావం కాదు. అందితే ఆనందించే స్వభావం. ముగ్గురు మగపిల్లల తర్వాత పుట్టిన వరం అని తల్లిదండ్రులు ఎంతో ప్రేమగా వరలక్ష్మి అని పేరు పెట్టుకున్నారు. అమె పుట్టగానే యిది నా కోడలు అని మాట తీసుకుంది మేనత్త.

"అన్నయ్యా! దీన్ని నా కొడుక్కే యివ్వాలి. అట్లా మాటిస్తేనే దీని పుట్టు వెంట్రుకలకు వస్తా" అని బెట్టుచేసింది మేనత్త భూలక్ష్మి.

వరలక్ష్మి పుట్టిన్నించి అన్నీ కల్సి వస్తున్నాయి. అది పుట్టిన గడియ ఆదృష్టగడియ అని అందరూ మురిసిపోయారు.

భూలక్ష్మికి పుట్టిల్లంటే ఎంతో ప్రేమ, అన్నయ్యలు తలా ఒక షాపు పెట్టుకొని కాస్త మంచిగా బతుకుతున్నారు. భూలక్ష్మి వాళ్ళాయన బొంబాయి, భీవండి వలసపోతాడు. బట్టల మిల్లులో పని చేస్తాడు. వెనకటే తండ్రి, చేనేత కుల వృత్తి పోయినా పూర్వంలాగే అన్నింటికి తండ్రిలా మర్యాదలు చేసే అన్నలంటే ఆమెకు ఎంతో మమకారం.

వరలక్ష్మికి పెళ్ళి గురించి ఏమి తెలియని వయస్సులోనే పెళ్ళికి తొందర పెట్టింది భూలక్ష్మి ఇంట్లో తనకో కూతురులా తోడుంటుందని పని చేస్తుందని ఆశ. తొమ్మిదేళ్ళ వరలక్ష్మికి, పద్నాలుగేళ్ళ అంజనేయులుకూ అట్లా పెళ్ళి జరిగింది. రాకపోకల మర్యాదలన్నీ ఎంతో ఘనంగా జరిగాయి. వరలక్ష్మికి పదిహేనో ఏట ఒడిబియ్యం నింపి మంచం, పరుపు సారె, సరంజామా, తినుబండారాల్తో మళ్ళీ పెళ్ళంత ఘనంగా శోభనం ఫంక్షన్ చేసి యిద్దరిని ఒకటి చేశారు.

అంజనేయులుకు ఎనిమిదో తరగతి తర్వాత చదువు సాగలేదు. కిరాణకొట్లో జీతం కుదిరాడు. రెండేళ్లు తిరక్కుండానే అందులోంచి బయటకు వచ్చాడు. మేన మామల్ని చూసి ఉత్తేజం పొందాడు. కిరాణాషాపు పెట్టాలనుకున్నాడు. పెళ్ళికిచ్చిన కట్నం పైసలు అమ్మనడిగాడు. అమ్మ, అన్నయ్య దగ్గరికి వెళ్ళింది తనకు కొడుకు అల్లుడూ వేరు కాదని కొడుకులు బట్టల షాపు పెట్టుకోవడానికి సర్దినట్టే పెట్టుబడిని సర్దాడు వరలక్ష్మి తండ్రి లక్ష్మినారాయణ.

చిన్నగా కిరాణా షాపుతో పాటు అందులోనే టీ కొట్టు కిళ్ళికొట్టు పెట్టాడు అంజనేయులు. చురుకైన స్వభావం. సునిశిత పరిశీలనా శక్తి. అందరితో మాటగోలు తనం. గిరాకి పెరిగింది. ధాన్యం తీసుకొని సరుకులిచ్చేవాడు. ఆ ధాన్యాన్ని బయట అమ్మేవాడు. అలా పండిన ధాన్యాన్ని అమ్మేక్రమంలో ధాన్యం వ్యాపారం ఎందుకు చేయకూడదు. అనే ఆలోచన కలిగింది ఆంజనేయులుకు. ఆలోచన

రావడమే తడువుగా, మామా, పెద్దనాన్న, చిన్నాన్నా అంటూ అందరి దగ్గరికి తిరిగి ఈసారి ధాన్యం తనకే యిమ్మన్నాడు. టౌన్‌లో ఏ ధర వస్తుందో అదే ధర యిస్తాను. ఒకరు వెంటరండి, లారీ కిరాయిలు తలాయిన్ని వేసుకోండి అన్నాడు. అట్లా వూరి వాళ్ళకు సాయమయ్యాడు. తలలో నాలుక అయ్యాడు. రెండో ధఫా యింత రిస్కు తీసుకున్నందుకు కాస్త కమీషన్ ఇమ్మని కోరాడు. తమ కళ్ళముందు పెరిగిన పిల్లవాడు, తమలో కలిసినట్టుంటున్నాడు. కాస్త యివ్వడం తప్పేమిటి అని అంగీకరించారు. కొసరు అడిగినంత ప్రేమగా యిచ్చారు. అట్లా బేరం పెరిగింది. ధరల పెరుగుదల వల్ల కలిగే లాభం అంజనేయులుకూ కాస్త లాభించడం మొదలైంది.

కొని స్టాకు పెట్టగలిగే పైకం కూడబెట్టగానే పంటమీద కొని కాస్త రోజులాగి ధరపలికాక టౌన్‌కు తీసికెళ్ళి అమ్మాడు ఆంజనేయులు. అట్లా అతని లాభం, సంపాదన పైసలు రూపాయల్లోనే అయినా గుణకారంలో పెరిగింది. ధాన్యం సేకరణ కోసం తిరగడంలో టి కొట్టు నడపడం కష్టమైంది. తండ్రి భీవండి పోవడం మానేసి కిరాణాషాపు, టి కొట్టు చూసుకోవడం ప్రారంభించాడు.

సైకిల్ మీద ఊళ్ళన్ని తిరిగి ధాన్యం సేకరించడంతో ఎండలో, ఆకలితో నీరసించిపోయాడు ఆంజనేయులు. పేదరికం నుండి ఎదిగిన ఆంజనేయులు ఆకలిని, నీరసాన్ని లక్ష్యపెట్టలేదు. డబ్బు సంపాదించే కిటుకు తెలిశాక మిగతాదేన్ని లక్ష్యపెట్టలేదు. చివరకు భార్యని పట్టించుకోలేదు.

అట్లా ఏళ్ళతరబడి చెమటకార్చి, అలసిసొలసి కడుపుకు తినకుండా కూడ బెట్టిన పైకంతో ఎందుకో అకస్మాత్తుగా సుజికీ బండి కొనాలనుకున్నాడు ఆంజనేయులు. సుజికీతో ఊళ్ళు తిరగడం సులువై ధాన్యం బేరం కూడా పెరుగుతుందని లెక్కలు తీసే చూశాడు. లెక్కల్లో లాభాల గుణకారమే కనపడింది. అమ్మానాన్నలకు చెప్తే ఆ పైసల్తో ఓ యిల్లే కట్టవచ్చునని అల్లరి చేసి కొనకుండా చేస్తారని తెలుసు. అందుకని అకస్మాత్తుగా కొనుక్కొచ్చి యింటిముందు పెట్టాడు. మొదటిరోజు నాది కాదు. ఓ ఫ్రెండుది అని బుకాయించాడు. నాలుగోరోజుకు అసలు విషయం చెప్పక తప్పలేదు. తల్లీతండ్రీ లబోదిబోమన్నారు. కాని షాపుముందు నీడలో ఎర్రటి రంగులో మిలమిల మెరిసే సుజికీని చూస్తుంటే తల్లిదండ్రులు సంఘంలో తమ హోదా పెరిగిందని లోలోపల సంతోషించారు. అలుసిస్తే మరీ షోకులకు ఎగబడి చెడిపోతాడని కొడుకు తమ భయంలో ఉండాలని పైపైన వ్యతిరేకించారు.

ఓ రోజున వరలక్ష్మిని సుజికీపై ఎక్కించుకొని టౌన్‌కెళ్ళాడు ఆంజనేయులు. అదృష్టమంటే వరలక్ష్మిదే అన్నారు. ఆమె మెట్టినింట కాలుపెట్టిన గడియ మంచిదన్నారు. వరలక్ష్మి హృదయం సంతోషంతో ఉప్పొంగింది.

మరుసటిరోజు స్నేహితురాళ్ళు వరలక్ష్మిని యక్షప్రశ్నలు వేశారు. ఆ వూళ్ళో ఆది మూడోమోటర్ సైకిల్ మాత్రమే. వారిలో తమకు తెల్సిన వాళ్ళు వీళ్ళొక్కరే.

"ఔనేవరా! బొందల్లో, కంకర రోడ్డు మీద బండి ఎత్తేసినప్పుడు భయం వెయ్యలేదానే" పక్కింటి పార్వతి ఆశ్చర్యంగా అడిగింది.

"ఔను" అంటూ ముసిముసిగా నవ్వింది వరలక్ష్మి.

"అయితే సినిమాల తీరు మీ ఆయన నడుం చుట్టూ చెయ్యివేసి దగ్గరగా కౌగిలించుకున్నావు అవునా!"

మధురోహల్లో తేలిపోతూ ఔనంటూ నవ్వింది వరలక్ష్మి

"నీకేమన్నా మల్లెపూలు కొన్నాడా!" ఆరా తీసింది అవతలింటి అరుణ.

"ఇదిగో రెండు రూపాయలవి కొన్నాడు." అంటూ వాడిన మల్లెల చెండు చూపింది వరలక్ష్మి.

" ఈ పూలు రాత్రి తీసి పక్కకు పెట్టలేదు. అందుకే బాగా నలిగిపోయాయి."

అయిదారుగురు స్నేహితురాళ్ళు ఒక్కటే నవ్వులు. వరలక్ష్మికి వాళ్ళు ఎందుకంత నవ్వుతున్నారో మొదట అర్ధంకాలేదు. ఆ తర్వాత తానూ నవ్వేసింది.

''ఔను వరా! సుజికీ మీద కూర్చుంటే నీకు ఎలా అన్పించిందే.''

''మెత్తగా హాయిగా''

''బస్సులో లాగానా?''

''ఎంత మెత్తగా యింతమెత్తగానా'' అంటూ పిర్రగిచ్చింది సీత. అందరూ మళ్ళీ నవ్వులు.

''వరా! సినిమా హాళ్ళో మీరిద్దరు పక్కపక్కనే కూర్చొని ఒకరి చెయ్యి ఒకరికి తాకించుకున్నారు ఔనా!'' ఏదో సిన్మాలోని సన్నివేశాన్ని గుర్తుచేసుకొంటూ అడిగింది సీత.

సినిమా హాల్లో ఒడిలో చెయ్యిపెట్టి అక్కడక్కడా పెట్టిన చెక్కిలిగింతలు గుర్తుచేసుకొని సిగ్గుతో ఊహు అని అడ్డంగా తలూపింది వరలక్ష్మి.

''ఇక నీ కడుపు కూడా పండుతుందే'' అని పొట్టనిమిరి చక్కలిగిలి చేసి ముద్దు పెట్టుకుంది చిన్ననాటి స్నేహితురాలు సీత.

సుజికీ రావడంతో ఆవాడలో ఆకుటుంబం హోదాలో చాలా మార్పు వచ్చింది. పది కిలోమీటర్ల దూరంలోనే ఉన్న టౌన్ నించి యిదీ అదీ తెమ్మని అందరూ పని చెప్పడం ప్రారంభించారు. అట్లా భూలక్ష్మిని పలకరించే మర్యాద పెరిగిపోయింది. వినయం గల ఆంజనేయులు అదే తనకు శ్రీరామరక్ష అనుకున్నాడు. ఎవరు ఏ పని చెప్పినా వినయంగా సరేనంటూ తెచ్చి వాళ్ళింటికి వెళ్ళి యిచ్చి వస్తాడు. వాళ్ళ హృదయాలు కృతజ్ఞతో, ప్రేమతో నిండిపోయేవి.

అలా సుజికీ వచ్చాక వరలక్ష్మికి స్నేహితురాళ్ళు కూడా పెరిగారు. ఆంజనేయులుకు చెప్పడానికి సిగ్గుపడి వయస్సుగల ఆడపిల్లలు వరలక్ష్మికి చెప్పి ఆంజనేయులు ద్వారా తెప్పించుకునే వారు.

అంజనేయులు సుజుకీకొని ఏడాదైపోయిపోయింది. సుజికీ యిపుడు హోదాకోసం కాకుండా బేరం కోసం అవసరమై కూర్చుంది. సుజికీతో అంతగా పని సృష్టించుకొని మరో సుజికీ కొనే స్థాయికి ఎదిగాడు అంజనేయులు.

అంజనేయులు తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేవు. వారి ఆనందం గుణకారాల్లో పెరిగిపోయిపోయిది. సైకిల్ తొక్కే అయాసం తగ్గడంతో ఇంట్లో కాస్త మంచి తిండికి బడ్జెట్ పెంచడంతో ఈ ఏడాదిలో అంజనేయులు ఒళ్ళు చేసి నునుపు తేలాడు. ఇంకా కోడలి కడుపున కాయ కాయనందుకు తల్లిదండ్రుల్లో అత్తమామల్లో కాస్త అసంతృప్తి. మరి కొన్ని నెలలు గడిచాయి.

అంజనేయులు దీపావళి నోములకు తీసుకొచ్చిన వరలక్ష్మిని పదిరోజులైనా తీసుకుపోవడానికి అంజనేయులు సుజికీపై రాకపోవడంతో తండ్రి లక్ష్మినారాయణ మొదటిసారిగా కలత చెందాడు. సజికీపై వాళ్ళ వూరినుంచి ఈ వూరికి రావడానికి పదినిమిషాలు పట్టదు పదిరోజుల్లో ఒక్కసారైనా రాలేదు.

''ఇటు వచ్చే ముందు అల్లునితోని ఏమన్నా కొట్లాట పెట్టుకున్నారే?'' అంటూ అరాతీసింది ఎల్లమ్మ.

''లేదు'' అంది వరలక్ష్మి

'' మరి పదిరోజుల్నించి అల్లుడు యిటుకేసి ఎందుకు రాలేదే'' అంటూ అరగంటసేపు గుచ్చిగుచ్చి ప్రశ్నించింది.

ఆ ప్రశ్నలతో ఏదో జరగరానిది జరిగిపోయిందోమో అని వరలక్ష్మి బెంబేలెత్తిపోయింది.

కన్నీళ్ళు పెట్టుకుంది. మళ్ళీ అడిగితే నాకేం తెల్సు అంటూ ఏడ్చేసింది. ఎల్లమ్మ కుడి కన్ను అదిరినట్టయి ఏదో కీడు శంకించింది. ఆందోళన పడిపోయింది.

ఈ ఇంటి ఆడపడుచైనా పదిరోజులుగా యిటుకేసి రాలేదు. ఏం జరిగి ఉంటుందని ఎల్లమ్మభయపడింది. చెల్లెలైనా రానందుకు లక్ష్మినారాయణ హృదయం గాయపడింది.

"నువ్వోసారి పోయిరా" అంటే

"నువ్వే ఓసారి పోయిరా"

అంటూ వాదించుకున్నారు భార్యాభర్తలు. ఇలా అక్కడికి వెళ్ళడం వారి అహంమీద, ఆత్మ గౌరవం మీద పడుతున్న తొలిదెబ్బ. మీ చెల్లెలింటికి పోవడానికి నీకేమిటి అభ్యంతరం అని ఎల్లమ్మ నీ ఆడబిడ్డ ఇంటికి పోవడానికి నీకేమిటి అవమానం అని లక్ష్మినారాయణ.

చివరకు ఎల్లమ్మే బయలుదేరింది. ఆ రోజంతా ఉంచుకొని కల్లు, మాంసం, పూరీలు వగైరా మర్యాదలన్నీ చేసి రాత్రి అక్కడే ఉండేట్టు బలవంతం చేశారు. ఉదయం టీ తాగి వెళ్ళిపోతూ అగింది ఎల్లమ్మ. ఎవరూ వరలక్ష్మి విషయం ప్రస్తావించలేదు. చివరకు మనస్సు కూడగట్టుకొని ఎల్లవ్వే ప్రస్తావించింది.

ఆడపడుచూ, ఆమె భర్త ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు. "మాకేం ఎరుక మీఅల్లుడినే అడుగు" అన్నారు. షాపు నుండి అల్లుడు వచ్చేదాక ఆగి అడిగింది ఎల్లమ్మ.

"పని తీరుత లేదు అత్తా. దుకాణంలో గిరాకి ఎక్కువైంది. నేను వీలు చూసుకొని రేపో మాపో వస్తాను" అన్నాడు అంజనేయులు. ఆ మాటల్లో అణుకువా, చొరవాలేవని గమనించింది ఎల్లమ్మ. ఇంతదాకా అల్లుడిని తన సొంత కొడుకులాగే చూసింది. ఇప్పుడతను అల్లుడులా మాట్లాడుతున్నాడు. కనుగుడ్ల నిండా నీళ్ళు ఉబికాయి. ఎల్లమ్మ కళ్ళొత్తుకుంది.

"ఎందుకు వదినే - ఏం జరిగింది" అంటూ గాభారాగా వచ్చింది భూలక్ష్మి. ఎల్లమ్మ కన్నీళ్ళను తుడిచింది, ఎందుకో తనూ కన్నీరు పెట్టుకుంది. మాటపెగలని గొంతుతో వీడ్కోలు తీసుకుంది ఎల్లమ్మ.

సంక్రాంతి వచ్చింది పోయింది. అల్లుడు రాలేదు. వరలక్ష్మి అత్తారింటికి పోలేదు. ఈ లోపు రెండు సార్లు వరలక్ష్మి అన్నయ్యలు అంజనేయులు బావ దగ్గరికి వెళ్ళి కల్సి వచ్చారు. అదే సమాధానం వీలు చూసుకొని రేపోమాపో వస్తా బావా! అంటూ.

ఎక్కన్నించి ఎలాపుట్టిందో పుకారు. ఇది నిజమేనా! అంటూ లక్ష్మినారాయణనే అడిగేసరికి విస్తుపోయాడు.

"వరకు అంజనేయులు విడాకులిస్తాడట నిజమేనా! అసలు ఏంజరిగింది. ఎందుకు కొట్లాడుకున్నారు. విడాకుల దాకా ఎందుకు వచ్చింది?" ఇంకెన్నో ప్రశ్నలు.

జీవితంలో ఎన్నడూ ఊహించని ప్రశ్నలు, జవాబు తెలియని ప్రశ్నలు. అసలు పోట్లాట ఎక్కడిది? విడాకులేంటి! ఏమి అర్థంకాక తలపట్టుకున్నాడు తండ్రి లక్ష్మినారాయణ. ఆ రాత్రి మొదటిసారి అతడికి గుండెపోటు వచ్చింది. మరోవైపు ఎల్లమ్మ విలపించింది. తండ్రికి గుండెపోటు వచ్చిన విషయం కొడుకులు,కోడళ్ళు గమనించలేదు. తండ్రి చెప్పుకోలేదు. ఒక గంట తీవ్రమైన నొప్పి. కొద్ది కొద్దిగా నొప్పి తగ్గింది. భార్య భర్తలు పరస్పరం ఓదార్చుకున్నారు. కోడళ్ళుమౌనంగా ఉండిపోయారు. కొడుకులు రేపుపోయి అడిగివస్తాం. అనవసరంగా కంగారు పడకండి అంటూ అమ్మానాన్నలను సముదాయించారు.

ఈ ఏడ్పుల్లో వరలక్ష్మి దుఃఖాన్ని ఎవరూ గమనించలేదు. ఎన్ని కష్టాలొచ్చినా ఎంత బాధ

కలిగినా పంటిబిగువుతో అదిమి పట్టి ఏడ్వంటే ఎరుగని వరలక్ష్మి ఇంట్లో కనపడలేదు.అందరు కంగారు పడిపోయారు. చీకటి నిండిన సామాను గదిలో పాత కుండల దొంతరల పక్కన ఒదిగిపోయి వెక్కివెక్కి ఏడ్చింది వరలక్ష్మి.

బయట వెతికి వెతికి చెల్లెలు యింట్లోనే ఉందని తెలిసాక హమ్మయ్య అని ఊపిరిపీల్చుకున్నారు. ఏ బావిలోనో, చెరువులోనో దూకిందేమోనని భయపడిన హృదయాలు తెప్పరిల్లాయి.పైకి ధైర్యం ప్రకటిస్తూ ఓదార్చారు అన్నలు.

"పిసదానా! ఈ కాస్తదానికే ఏడుస్తున్నావా? ఎవడో ఏదో పుకారు పుట్టిస్తే నమ్మడమేనా. రేపే పోయి బావను తీసుకొస్తాం" అని అనసైతే అన్నారు గానీ మనస్సు ఏదో కీడు శంకిస్తుంది.

బావమరుదులు పోయినా పలితం కనపడలేదు. అంజనేయులు ఏ మాటా స్పష్టంగా చెప్పడు. తల్లిదండ్రులు మాకేమి తెలియదు అంటారు. లక్ష్మినారాయణ ఎల్లమ్మా కల్సి వెళ్ళారు. ఉత్తచేతుల్తో తిరిగి వచ్చారు.

కొద్ది రోజులు పోయాక ఆ పూరి కులం పెద్ద మనిషి వచ్చి చెప్పాడు. ఇంటిల్లి పాది నోట మాటరాక నిర్వీరులైపోయారు.

"ఈ వచ్చే ఆదివారం కుల పంచాయితీ ఉంది. వరలక్ష్మితో అంజనేయులు సంసారం చేయడట. విడాకులు కావాలని దరఖాస్తు యిచ్చాడు. పెద్దమనుషులు ఎంత చెప్తే అంత పెళ్ళి ఖర్చులు. వగైరా కట్టిస్తానన్నాడు. మీరు కూడా ఓ అయిదుగురు కలిసి పెద్దల్ని తీసుకొని ఆదివారం పొద్దున్నే రండి."

వచ్చిన పెద్దమనిషి వెళ్ళిపోయాడు. అతనికి టీ మర్యాద చేయాలనే విషయం కూడా మర్చిపోయారు. ఎన్ని నోములు నోస్తే పుట్టిన కూతురు బతుకు యిట్లా ఎందుకవుతున్నది. నేను నీకు ఏం అన్యాయం చేసిన దేవుడా అంటూ చేతుల్లో ముఖందాచుకొని పొగిలి పొగిలి ఏడ్చాడు లక్ష్మినారాయణ. ఎల్లమ్మ ఏడ్పుతో యిరుగుపొరుగు జమయ్యారు. ఏదైనా అఘాయిత్యానికి పాల్పడుతుందేమోననే భయంతో కోడళ్ళు ఆడపడుచును ఓదార్చుతూ కాపలాకాస్తున్నారు.

కుల పంచాయితీ సాగు తోంది. ఇది మూడోసారి కూర్చోవడం. అదే పెద్దమనుషులు, అవే ప్రశ్నలు- అవే జవాబులు, రెండు నెలలుగా సమస్య అలాగే ఉంది.

"విడాకులెందుకు తీసుకోవాలను కుంటున్నావు" ఒక కుల పెద్ద ప్రశ్న

"నాకు యిష్టంలేదు" అన్నాడు అంజనేయులు.

"ఏమైనా కొట్లాడుకున్నారా!"

"లేదు"

"ఆమెలో నీకు ఏమైనా చెడు నడకలు కనపడ్డాయా! లేక వినపడ్డాయా!"

"ఆమె నాభార్య-ఈ మాటలు యింకెవరైనా అంటే నాలుక చీరేవాన్ని"

"మరైతే ఆమెకు నీవంటే ప్రేమలేదా!"

"ఉంది"

"మరి ఎందుకు వద్దంటున్నావు సంతానం కాలేదనా?"

"కాదు"

"మరెందుకు?"

"ఆమెతో సంసారం చేయడం నాకు యిష్టంలేదు."

"నీ తిక్కనీదేనా! ఎందుకు యిష్టం లేదో కారణాలు లేకుండానే యిష్టంలేదంటే విడాకు

లిస్తారా! ఇదేమైనా పెళ్ళాం అనుకున్నావా? ఉంచుకున్నదనుకుంటున్నావా! పిల్లల ఆటనుకున్నావా!''

అట్లా చర్చ వేడెక్కుతూనే పోయింది. మళ్ళీ ఒకరి తర్వాత ఒకరు చర్చను ఓపికగా చర్చించే స్థితికి తీసుకువచ్చి అడిగారు.

''నీకు ఎందుకు యిష్టంలేదు.''

''ఆమెకు చెవుడు ఏది చెప్పినా గట్టిగా అరిచి చెప్పాలి.''

''పెళ్ళయినపుడు ఆమెకు చెవుడని తెలియదా?''

''తెలుసు''

''తెల్సేచేసుకున్నావుగదా!''

''నేనప్పుడు బుద్ధి తెలియని వాన్ని. అమ్మానాన్నలు కల్సి చేసారు.''

''అప్పుడు బుద్ధితెలియక పెళ్ళిచేసికొన్నవు. ఇప్పుడు బుద్ధి తెల్సినంక విడాకులిస్తానంటవు. నీ చెల్లెలుకే ఈ చెవుడుంటే నీ బావే యిట్లా విడాకులిస్తానంటే నీకే మనిపించదా? నీ చెల్లెలి బతుకు ఏం కావాలని బాధనిపించదా?''

మౌనం.

''అది నీ మేనమరదలురా! అది పుట్టిన్నించే నీ పెళ్ళాం అని పేరు పెట్టారు. దానికి పుట్టిన్నించి నీవు తప్ప వేరే లోకం తెలియదు. ఇంత దగ్గరి సంబంధంలో అన్నీ తెల్సిన నువ్వే దాన్ని వద్దంటే ఎట్లా! దానికి జీవితాన్నివ్వడం నీకు మీ మామ ఒకస్థాయి జీవితాన్నిచ్చినందుకైనా నీబాధ్యత కాదా! మేనబావగానైనా, భర్తగానైనా నీ బాధ్యత కాదా'' అంటూ మరో పెద్దమనిషి కన్నీరు పెట్టుకుంటూ తన చెల్లెలు బతుకు ఎట్లా బండల పాలైందో చెప్పాడు.

అయినా అంజనేయులు హృదయం కరగలేదు.

''ఎంత బేమాన్‌వురా నువ్వు కృతజ్ఞత లేదురా నీకు. నీకన్నా కుక్కనయంరా! పుటకు గతి లేక వాళ్ళ తిండి తిని వాళ్ళవల్ల పెరిగి, బ్రతికి దాన్ని విడిచిపెడతాననడం పాపం తగులుతుందిరా నీకు. పురుగులు పడి చస్తావురా'' ఒక పెద్దమనిషి అరుస్తూ శపించారు.

పంచాయితీ మరో నెల వాయిదా పడ్డాక మళ్ళీ కూర్చున్నారు. పాత ప్రశ్నలు పాత చర్చలకు కొన్ని కొత్త పరిష్కారాలు జోడించారు.

''నువ్వు యింకో ఆమెను చేసుకో. వరలక్ష్మికి పెద్దభార్యగా గౌరవ, హోదా యిస్తే చాలు ఆమె జీవితాన్ని నిలబెట్టిన వాడివవుతావు. దూరపు సంబంధం కాదు. పుట్టిన్నించి నీభార్యగా పెంచబడ్డ పిల్ల. ఆలోచించు. ఆమెకు కాన్పు కాలేదని రెండో సంబంధం చేసుకున్నాడని పెద్దమనుషులం మేమంతా చెప్తాము. ఇద్దరికీ పిల్లలైతే సంతోషమే. ఆమె తన పని తాను చేసికొని బతుకుతుంది. ఆర్థికంగా నీకే భారమూ కాదు. మీ మేనమామనే ఆమెకు అన్నీ సమకూర్చుతడు.'' అంటూ పెద్ద మనుషులు రాజీ పథకం రూపొందించారు.

''అలా నాకిష్టం లేదు. విడాకులు తీసుకున్నాకే నేను మళ్ళీ పెళ్ళి చేసుకుంటాను.''

తర్జన భర్జనలయ్యాయి. నెలల తరబడి విసిగి పోయిన పెద్దమనుషులు విడాకులకు ఖర్చులు పద్దులు చర్చించడం ప్రారంభించారు.

''నాకు పైసావద్దు. నేను తిరిగి తీసుకోవాడనికి అతనికి పెట్టుబడి పెట్టలేదు. అతడు నా కొడుకుల్లో మరోకొడుకు అనుకున్నాను. నా కూతురు అదృష్టం ఎలా ఉంటే అలా జరుగుతుంది. నా కొడుకే యిలా చేశాడనుకుంటాను. అతన్నించి ఒక్క పైసావద్దు. ఇది నా చెల్లెలు, ఇతడు నాబావ'' అంటూ తువ్వాలలో మొహం దాచుకుని లక్ష్మినారాయణ వెక్కివెక్కి ఏడ్చాడు.

ఎల్లమ్మ ఏడ్పుతో పంచాయితీ ప్రాంతం అంతా శవ వాతవరణం అలుముకుంది. పెళ్ళి ఖర్చులు, పెట్టుపోతలు తీసుకోకుండా విడాకులేమిటి అని పెద్దలు ఆశ్చర్యపడ్డారు. అభ్యంతర పెట్టారు, ఊరివాళ్ళు ముక్కున వేలేసున్నారు. విడాకుల కాగితాలు, సంతకాలు పూర్తయ్యాయి.

అంజనేయులుకు అందమైన అమ్మాయి లక్ష కట్నంతో సహా దొరికింది. రెండేళ్ళు తిరక్కుండానే తండ్రయ్యాడు. ఈ రెండేళ్లల్లో ఒక పెద్ద బంగాళా కట్టాడు. బజార్లో షాపును కొని సొంత షాపులోకి మార్చాడు. చిన్నలారీ కొనే ప్రయత్నంలో ఉన్నాడు.

వరలక్ష్మికి రెండో పెళ్ళి సంబంధాలు వెతికి వెతికి లక్ష్మినారాయణ వేసారి పోయాడు. ఆడపిల్లకు మొదటి సంబంధమే దొరకడం కష్టంగా ఉంటే చెవిటి పిల్లకు రెండో సంబంధం దొరకడం ఎంత కష్టమో తెల్సివచ్చింది.

వెనకాముందు ఏమీలేని కుటుంబం నుంచి వచ్చిన చేనేత సంఘంలో కూలికి నేసే రాజయ్యతో ఇంట్లోనే చిన్న ఫంక్షన్‌తో వరలక్ష్మికి మళ్ళీ పెళ్ళయిందనిపించారు. పెళ్ళయితే జరిగింది కాని వారి యిల్లు జరగడం కష్టంగా ఉంది. ఆ కుటుంబాన్ని సాకడం తమవంతే అని తండ్రికి తెల్సిరావడానికి ఎంతో కాలంపట్టలేదు.

కొడుకులకు తమ పిల్లల ఎదుగుతుండడంతో నాన్న చెల్లెలుకు ఉన్నదంతా పెడ్తున్నారని గొణగడం ప్రారంభించారు. కోడళ్ళు భయభక్తులతో మిన్నకుండిపోయారు, కొడుకుల మాటల్తో తల్లిదండ్రుల హృదయం కలుక్కుమంది.

"అది మీ సొంత చెల్లెరా, నాకడుపున పుట్టిన బిడ్డ మేంసంపాదించింది పెడ్తేనే మీరు ఓర్వడంలేదు మేంపోయక దానికి ఏం పెడుతారు. అది మీలాగా కొడుకైతే మీతో పాటు అది పాలు పంచుకునేది! నీ బిడ్డే అయితే .ఇట్లాగే అంటారా మీరు" అని ఎల్లమ్మ ఏడ్చింది. కొడుకుల్ని తిట్టింది కొడుకులకు చెల్లెలి పట్ల హృదయంలో ఎక్కడో అడుగున ఉన్న ప్రేమ సానుభూతిగా మారింది.

వరలక్ష్మి పిల్లలయ్యారు. తన పిల్లల్లో ఒక కొడుకులా భర్తను చూసుకుంటోంది. పనికి పోయినా ఏమి అనదు. తాగడానికి అప్పులు చేసినా మాట అడగదు. వారికి తమ యింటి పక్కనే అమ్మకానికొచ్చిన యిల్లు కొనాలనుకున్నారు తల్లిదండ్రి టౌన్లో బంగ్లా కట్టుకొని ఏదో ఒక ధరకు తెల్సినవారికివ్వాలని అమ్ముతున్న పెద్ద యిల్లది. ఖాళీ స్థలం ధరకే యిల్లు యిచ్చేశారు. అల్లుడికి తనపట్ల అత్తా మామలకు గల ప్రేమ అర్థమై మనస్సు స్థిరపడింది. కాస్త పని చేయడం మొదలెట్టాడు.

రోజు రోజుకు చిక్కిపోతున్న అల్లుణ్ని చూసి కూతురు బతుకేమవుతుందోనని ఎల్లమ్మ బావురుమంది. కొడుకులు పట్టించుకోలేదు. ఆ తాగుడుమాన్పించు అని ఈసడించి తప్పుకున్నారు. ఎల్లమ్మే డాక్టరు దగ్గరికి టౌనుకు బయల్దేరదీసింది. ఎక్స్‌రేలు,పరీక్షలు అన్నీ అయ్యాక టీ.బి. అని తేలింది. ఇక ఎన్నాళ్ళో బతకడు అనే స్థితికి చేరిన టీ.బి. పోషకాహారలోపం వల్ల వచ్చిందని అన్నాడు డాక్టరు.

మందులు, ఎక్స్‌రేలు, రిపోర్టులు తీసుకొని యిల్లు చేరారు. విషయం విని తండ్రి హృదయం మూగ బోయింది "నన్ను అదృష్టవంతురాలి వంటివి గదనే అమ్మా! అదృష్టం అంటే ఇదేనా" అంటూ వరలక్ష్మి ఏడ్చింది. వరలక్ష్మి ఏడ్పును ఎవరూ ఆపలేక పోయారు.

"నువ్వు అదృష్టవంతురాలివేనే, కాని నీ అదృష్టాన్ని నీకు కాకుండా ఇతరులెత్తుక పోతున్నారు" అంటూ విలవిలలాడింది తల్లి ఎల్లమ్మ.

తన గారాల కూతురు అందరి యింట్లో లక్ష్మిని నింపింది. ఆమె పుట్టిన తర్వాతే చిన్నయిల్లు, పెద్ద ఇల్లయింది. మూడు బంగ్లాలయాయి. పట్టింది బంగారం అయ్యింది.

కాని వరలక్ష్మి బతుకు యిట్లా ఎందుకవుతున్నదో అని లక్ష్మినారాయణ రాత్రంతా విలపించాడు. ఆ రాత్రి ఏ గడియలో గుండెపోటు రెండో స్ట్రోక్ వచ్చిందో ఎవరికి తెలియదు. ఉదయానికి మంచంలో శవంగా బిగుసుకుపోయింది శరీరం. రోదనలతో యిల్లు నిండిపోయింది. ఇరుగుపొరుగు వచ్చి బంధుమిత్రులకు సమాచారం పంపారు. శవ దహనం కోసం కార్యక్రమాలు ప్రారంభించారు. బంధుమిత్రులందరు వచ్చారు. సొంత కొడుకులా చూసుకున్న మేనల్లుడు అంజనేయులు రాలేదేమని అన్నారు కొందరు. బతికి ఉన్నపుడే లేని ప్రేమలు చచ్చాక ఎందుకన్నారు మరికొందరు. పాడెలేచింది. వరలక్ష్మి హృదయం బద్దలయ్యేలా నాన్నా అంటూ ఏడుస్తోంది.. ఎంత పని చేస్తివి అంటూ ఎల్లమ్మ ఏడ్పులతో శవయాత్ర సాగింది. కొద్ది గంటల్లో లక్ష్మినారాయణ శరీరం మంటల్లో కాలి బూడిదైపోయింది.

ఒక తరం ముగిసింది. ఒక క్రమం ముగిసింది. ఆరునెలల్లో కొడుకులు ఆస్తులు పంచుకొని మూడు కుటుంబాలయ్యారు. అమ్మ ఎవరి పంచన ఇష్టంలేక తనకు తానుగా బ్రతుకుతుంది. ముగ్గురన్నదమ్ములు తలా ఒక బంగ్లా, వ్యాపారం పంచుకొని స్థిరపడ్డారు. అలా ఒక షోషలిస్టు నమూనా ఉమ్మడి కుటుంబం తండ్రి మరణంతో అంతరించింది. వరలక్ష్మి పేదల్లో ఒక పేదరాలుగా కలిసిపోయింది.

❃ ❃ ❃

**ప్రజాశక్తి (దిన పత్రిక) 20,జూన్,1999**